# ఝండా ఊంచా రహే హమారా!




చంద్రమౌళి

హఠాత్తుగా మీద పడిన శత్రువులా చీకటి ఆక్రమించింది. ఇంకొక చిన్న పెగ్ అన్నాడు మిస్టర్ బాబ్నా!

"చిన్నదేం ఖర్మ! పెద్దదే పొయ్యండి" అన్నాడు మేజరు హర్బిందర్‌సింగ్.

బాబ్నా విస్కీ సీసా తీసి మేజరుగారి గ్లాసులో పోసి, తన గ్లాసులో పైనాపిల్ జ్యూస్ పోసుకున్నాడు. మేజరుగారు విస్కీ చప్పరిస్తూ.

"విస్కీలో ఉన్న మజా పైనాపిల్‌లో ఎక్కడుంటుంది బాబ్నాగారూ! ఒక్క చుక్క పుచ్చుకు చూడండి!" అన్నాడు.

"అయ్యో! నేను శుద్ధ జైనుడిని! గురువులు ఎదుట శపథం చేశాను. అయినా ఏదో నూలు మిల్లు నడుపుకునే నా లాటి వాడికి విస్కీ ఎందుకు చెప్పండి. శత్రువుల సేనలను చెండాడ వలసిన మీ లాటి వాళ్ళకు కాని" అన్నాడు బాబ్నా.

ఉన్నట్లుండి ఒక్కసారి లైట్లు ఆరిపోయినయి. వెంటనే బాబ్నా పక్కనున్న టెలిఫోన్ మోగింది. తన స్థూలకాయాన్ని మెల్లగా ఒక పక్కకు చేర్చి టెలిఫోను అందుకున్నాడు బాబ్నా.

"హలో! ఆ! నేను బాబ్నానే మాట్లాడుతున్నాను. ఏమిటీ! అచ్ఛా. అచ్ఛా!" చీకటిగా ఉండటాన బాబ్నా ముఖ కవళికలు మేజరుకు కనిపించలేదు.

"మేజరుగారూ! అటు పక్కన యుద్ధం మొదలైంది. మీ రిక్కడున్నారు!" అన్నాడు వ్యంగ్యంగా బాబ్నా.

"వాట్ నాన్సెన్స్, ఇప్పుడు యుద్ధ మేమిటి. జోక్ చేస్తున్నారు" అన్నాడు మేజర్ సింగ్.

"ఇదుగో. ఇప్పుడొచ్చిన టెలిఫోన్ మేజిస్ట్రేట్ గారు చేశారు. యుద్ధం మొదలై అరగంటయిందిట. మన ఫోర్సెస్ మీద పాకిస్తానీలు కాల్పులు కాలుస్తున్నారుట. వాళ్ళ టాంకులూ అవీ ఉధృతంగా బార్డర్ వైపుకు వస్తున్నాయట! బ్లాక్ అవుట్‌కూడా డిక్లేర్ చేశారు చూడండి" అంటూ బాబ్నా టెలిఫోన్ తీసి ఏదో నంబరు తిప్పి.

"ఆనే అగర్వాల్! ఫాక్టరీలో లైట్లన్నీ బంద్ చెయ్యండి. బ్లాక్ అవుట్ డిక్లేర్ చేశారు" అన్నాడు

ఇంతలో గుండెల్ని చీలుస్తూ సైరన్ కూత కూడా వినిపించింది. మేజరు గుండు తగిలిన వాడిలా ఒక్క ఉదుటున లేచి నిలుచున్నాడు. గ్లాసులో మిగిలి పోయిన విస్కీ ఒక్క గుక్కలో తాగేసి—

"ఆ లుచ్చాలకు సమయం దొరకలా యుద్ధం మొదలుపెట్టటానికి" అంటూ గొణుగుతూ, "థాంక్యూ బాబ్నాజీ! నే నిక్కడకు వచ్చినట్లు మటుకు ఎవరికీ చెప్పకండి ప్లీజ్" అంటూ రయ్యిన పోయి తన జీపులో కూర్చున్నాడు.

## 2

యుద్ధం పెద్ద ఎత్తున మొదలైంది. రాత్రంతా ఫిరంగులు పేలుడు వినిపిస్తూనే ఉంది. జనాభా అంతా దద్దరిల్లి పోతున్నారు. ఇళ్ళు భూకంపం వచ్చినప్పుడు కదిలి పోయినట్లు కదులుతున్నై. బార్డర్‌కు ఆనుకున్న చిన్న చిన్న పల్లెల నుంచి జనం తరలి వెనక్కి వచ్చేస్తున్నారు. రోజూ ఎయిర్ రెయిడ్ సైరన్లూ, ఫిరంగుల మోతలూ వినిపిస్తున్నాయి. ఫిరంగి గుండు నాటు దూరంలో

